ప్రజాశక్తి
మంగళవారం 30 జులై 2024
5
పార్వతీపురం మన్యం

కలెక్టర్‌ను కలిసిన పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిగా ఎస్. సేధు మాధవన్ సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పరిధిలో గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఇటీవల పిఒగా పనిచేసిన విష్ణుచరణ్ బదిలీపై వెళ్లిన విషయం విదితమే. ఇంత వరకు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక ఇన్‌ఛార్జ్ పిఒగా వ్యవహరించారు.

కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న పిఒ

న్యాయం కోరిన దళితులపై నిర్బంధం

న్యాయం కోరేందుకు వచ్చిన దళితులపై పోలీసులు అడుగడుగునా నిర్భందాలకు పాల్పడ్డారు. ఎక్కకడిక్కడ అరెస్టులు చేసి భయబ్రాంతులకు గురిచేశారు. సహనం కోల్పోయిన బాధితులు ర్యాలీచేపట్టారు. దీన్ని కూడా అడ్డగించేందుకు ప్రయత్నించడంతో రోడ్డుపైనే బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. దిగొచ్చిన అధికారులు బాధితులతో చర్చలు జరిపారు. సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో శాంతించారు.

- ఎక్కడికక్కడ అరెస్టులు
- ర్యాలీ అడ్డగింతతో రోడ్డుపై బైఠాయింపు
- అధికారుల చర్చలతో శాంతించిన బాధితులు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

గరుగుబిల్లి మండలం శివ్వాం దళితులపై దాడి చేసిన పెత్తందార్లపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని, దళితుల భూములు వారికే అప్పగించాలని, జిల్లాలో ఇతర భూ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ గత 15 రోజులుగా కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యాన దళితులు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో సోమవారం చలో కలెక్టరేట్ తలపెట్టారు. ఈ కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేయసేందుకు నాయకులకు ముందస్తు నోటీసులు ఇచ్చారు. ఎక్కడికక్కడ అరెస్టులకు, గృహనిర్బంధాలకు ఒడిగట్టారు. అయినా బాధితులు, వారి తరపున పోరాడే శక్తులు, ప్రజాసంఘాలు వెరవలేదు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ర్యాలీ కలెక్టరేట్‌కు వెళ్తుండగా ఎఎస్‌పి సునీల్ షరోన్, సిఐ కృష్ణారావు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో పోలీసులు కలెక్టర్‌ను కలవనీయకుండా అడ్డుకొని, బలవంతంగా తమ వాహనాల్లో ఎక్కించి కొమరాడ, పార్వతీపురం పోలీస్ స్టేషన్‌కు తరలించి కార్యక్రమాన్ని భగ్నం చేశారు. మిగిలిన బాధితులు పోలీసుల చర్యలను, అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రతిఘటిస్తూ పార్వతీపురం చర్చి జంక్షన్‌లో బైఠాయించి నిరసనలు తెలిపారు. పోలీసులు ఎంత నచ్చ చెప్పినప్పటికీ వినకపోవడంతో ఆర్‌డిఒ కె.హేమలత వచ్చి నిరసన తెలుపుతున్నవారి వద్దకు వచ్చారు. సమస్యను తప్పకుండా కలెక్టర్ దగ్గరకు తీసుకువెళ్తానని, అలాగే కలెక్టర్ సూచనలతో గ్రామంలోని ఇరువర్గాలతోనూ జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించడానికి తప్పకుండా కషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో, రైతు సంఘ నాయకులు, బాధితులు కలిసి జాయింట్ కలెక్టర్‌కు వినతిని అందించి సమస్యను వివరించారు. శివ్వాం భూ సమస్యతో పాటు జిల్లాలోని అన్ని భూ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే 15 రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా కౌన్సిల్ సభ్యులు గంగారాపు సింహాచలం, జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, అఖిల భారత గ్రామీణ కార్మిక సంఘం పి.సంగం, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బొత్స నర్సింగరావు, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పండు, గిరిజన సంఘం నాయకులు ప్రభ, సింహాచలం, సంగాం, ఎస్ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్, గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతి రావు, సిఐటియు నాయకులు గొర్లి వెంకట రమణ, బి. సూరిబాబు, తదితరులు ఉన్నారు.

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిందితుల్ని అరెస్టు చేయకుండా బాధితులను అరెస్టు చేయడం దారుణమన్నారు. రెవెన్యూ అధికారులు దళారుల పక్షాన కొమ్ము కాస్తుండడం దారుణమని, వెంటనే ఈ చర్యను అరికట్టాలని, దళితుల భూ పోరాటానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ బాధితులు న్యాయం కోసం 15 రోజులుగా దీక్షలు చేపట్టినా కనీసం అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ శివ్వాంలో దళితులకు డిపట్టాలిచ్చి 50 ఏళ్లు అవుతున్నా దానిపైన నకిలీ ఇంజక్షన్ సూటు కోర్టును తప్పుదోవ పట్టించి తెచ్చిన పెత్తందారులు దళితులు సాగు చేస్తున్న భూమిపైకి వెళ్లి దళితులపై దాడి చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు శివ్వాం దళితుల భూమి దళితులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడిచేసిన పెత్తందారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు జిల్లాలో పేదలు సాగు చేస్తున్న భూములకు డి.పట్టాలు ఇవ్వాలని, పట్టాలిచ్చి భూములు అప్పజెప్పని భూములు గిరిజనులకు, దళితులకు అప్పజెప్పాలని అన్యాక్రాంతమై పెత్తందార్లు చేతుల్లో ఉన్న భూములు వెంటనే తిరిగి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నాయకులను అరెస్టు చేసి వ్యానులో తరలిస్తున్న పోలీసులు

ర్యాలీ చేపడుతున్న ప్రజా సంఘాల నాయకులు, దళితులు

ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

రోడ్డుపై బైఠాయించిన నాయకులు, దళితులు

జిల్లా వ్యాప్తంగా ముందస్తు అరెస్టులు

శివ్వాం దళితులపై అమానుషంగా దాడికి పాల్పడిన పెత్తందారులను అరెస్టు చేయాలని, వారి భూములను వారికే అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన ఛలో కలెక్టరేట్ ధర్నా కార్యక్రమం తలపెట్టారు. ఈ కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వ, పోలీస్ యంత్రాంగం ఆదివారం రాత్రి నుంచే నాయకులను అరెస్టు చేసేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాషను ఆదివారం రాత్రి తన ఇంటి వద్దనే నిర్బంధించారు. సోమవారం తెల్లవారి జామున, పాలకొండలో సిఐటియు నాయకులు డి.రమణారావును, సాలూరులో ఎన్.వై.నాయుడును, కొమరాడలో కొల్లి సాంబమూర్తిని వాళ్ల ఇళ్లవద్దనే పోలీసులు నిర్బంధించారు. ఎపి రైతు సంఘం ఉపాధ్యక్షులు బంటు దాసును అడ్డాపుశిలలో, గిరిజన సంఘం ఉపాధ్యక్షులు రావికోన సర్పంచు కె.రామస్వామిని రంగాలగూడలో నిర్బంధించారు. అయినప్పటికీ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలని కంకణం కట్టుకున్న నాయకులు, కార్యకర్తలు అనేక నిర్బంధాన్ని ఎదుర్కొని స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. కాంప్లెక్స్ నుండి కలెక్టరేట్ వరకూ ర్యాలీ కొనసాగించారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆగవు

గుమ్మలక్ష్మీపురం : ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేసినంత మాత్రాన ప్రజా ఉద్యమాలు ఆగవని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి, చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ అన్నారు. శివ్వాం దళితుల భూ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం చలో కలెక్టరేట్‌కు వెళ్తున్న రమణను ఎల్విన్‌పేట పోలీసులు ముందస్తుగా గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఉద్యమాలు, పోరాటాలు చేస్తున్న సిపిఎం, సిఐటియు, ఆదివాసీ నాయకులను అడ్డుకొనేలా ప్రభుత్వం చర్యలు చేయడం విచారకరమన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించని గత ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు. బొడ్లగూడలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు మండంగి శ్రీనివాసరావుకు పోలీసులు నోటీసులు ఇచ్చి హౌస్ అరెస్ట్ చేశారు. దుడ్డుఖల్లులో పువ్వల తిరుపతిరావును పోలీసులు గృహనిర్బంధం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి అడ్డుకున్నారు.

కురుపాం : అక్రమ గృహనిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని సిపిఐ జిల్లా నాయకులు జి.సూరయ్య అన్నారు. చలో కలెక్టరేట్ కార్యక్రమంలో పాల్గొనకుండా ముందస్తుగా కిచ్చాడలో ఆయన్ను పోలీసులు గృహనిర్బంధం చేశారు. మండలంలో పి.లేవిడి కూడలి వద్ద పోలీసులు శివ్వాం దళితుల సమస్యల పరిష్కారించాలని చేపట్టే ఛలో కలెక్టరేట్ కార్యక్రమంలో నాయకులు పాల్గొనకుండా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. రహదారి వెంబడి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు కార్యక్రమంలో ఎస్సై శివప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి సన్నాహాలు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆదివాసీ దినోత్సవాన్ని ఆగష్టు 9న నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వేదికగా ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివాసీ సంస్కతి, సంప్రదాయాలు అద్దంపట్టేలా వేడుకలు ఉండాలని స్పష్టం చేశారు. ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కళాకృతులు, నృత్యాలు, వంటకాలు, పంటలు ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. వివిధ శాఖలు, ప్రదర్శన శాలలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. తాగు నీరు, పారిశుధ్యం నిర్వహణను సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆయన ఆదేశించారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమగు మందులు సిద్ధం చేయాలని ఆయన అన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవం నిర్వహణకు వివిధ కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పిఒ ఎస్.సేధు మాధవన్, ఎఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్‌కిరణ్, ఇన్ ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవ నాయుడు, ఆర్‌డిఒ కె.హేమలత, ఐటిడిఎ ఎపిఒ ఎ మురళీధర్, అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రజలు సహకరించాలి

పార్వతీపురం రూరల్ : జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి జిల్లా ప్రజల సహాయ సహకారాలు ముఖ్యమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సెల్లార్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పాల్గొని సమస్యలతో మన దగ్గరకు వచ్చే దరఖాస్తుదారుల సమస్యను ఓపికతో వినాలని సూచించారు. సమస్యను పరిష్కారించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఐటిడిఎ పిఒ ఎస్.సేధు మాధవన్, ఆర్‌డిఒ కె.హేమలత అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి 154 అర్జీలు అందాయి. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీతంపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఐటిడిఎలో పిఒ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేదికకు 92 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ జి.సింహాచలం, డిప్యూటీ డిఇఒ నారాయుడు, ఎపిడి సన్యాసిరావు, సిడిపిఒ రంగలక్ష్మి, డిఇ గోపాలకష్ణ, మేనేజర్లు నరసింహులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిఒ 85ను పునరాలోచించాలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడికి ప్రభుత్వ వైద్యుల వినతి

ప్రజాశక్తి - మక్కువ

ప్రభుత్వ వైద్యుల పిజి ప్రవేశం కోసం ప్రభుత్వం తెచ్చిన ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన జిఒ నెంబరు 85 గురించి ప్రభుత్వం పునరాలోచన చేయాలని ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు సోమవారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. జిఒ 85ను వెనక్కి తీసుకొని ఇన్ సర్వీస్ కోటాను మునుపటి లాగానే ఉంచాలని కోరారు. ఇది సాధించే వరకూ తాము పోరాడతామని ఈ సందర్భంగా తెలిపారు. వినతిని అందజేసిన వారిలో పార్వతీపురం మన్యం జిల్లా, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా నేత్ర పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 1 నుంచి అక్టోబర్ 31 వరకు జరగనున్న పాఠశాల విద్యార్థుల కంటి పరీక్షలు కార్యక్రమంలో విద్యార్థులంతా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్యాధికారులు, సహాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే కార్యక్రమానికి ఎలాంటి ఏర్పాట్లు చేసుకోవాలి, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని దశ, దిశ చేశారు. దృష్టి దోషం ఉన్న విద్యార్థులందరికీ కళ్ల జోళ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు చేసిన వారి వివరాలు పోర్టల్‌లో ఎలా పొందుపర్చాలో వివరిస్తూ మెల్లకన్ను, గాయాల వల్ల వచ్చే కేటరాక్ట్ శస్త్ర చికిత్సలు కోసం పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

తక్షణ చర్యలు చేపట్టాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బాధితులు అందజేసిన ఫిర్యాదులపై చట్టప్రకారం పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి జిల్లా ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు,వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులుకు తక్షణమే తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని వదేశించారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదని, సకాలంలో చట్టపరిధిలో ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం అందించేలా చర్యలు తీసుకొని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏడు ఫిర్యాదులు అందాయి. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలున్నా ఆన్ లైన్ వెబ్ సైట్ www.cybercrime.gov.in ద్వారా,నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (N.C.R.P) లో టోల్ ఫ్రీ నెంబర్ 1930లి కు ఫిర్యాదు చేయొచ్చని వివరించారు.

ర్యాంపు రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వివి రమణ

ఇసుక ర్యాంపును పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - భామిని

మండలం లోని దిమ్మిడిజోలగ్రామ సమీపాన వంశధార నదీ తీరంలో నిర్వహిస్తున్న ఒడిస్సా ఇసుక ర్యాంపును పాలకొండ ఆర్‌డిఒ వివి రమణ పరిశీలించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపు ఒడిశా భూ భాగం పరిధిలో ఉందా, ఆంధ్రా భూ భాగం పరిధిలో వుందా అనే అంశాలు పరిశీలించి తనకు పూర్తి నివేదిక ఇవ్వాలని ఆర్‌డిఒ సర్వేయర్లుకు సూచించారు. పూర్తి నివేదిక వచ్చేంత వరకు ఇసుక ర్యాంపు తాత్కాలికంగా నిలిపి వేయాలని రెవిన్యూ అధికారులకు ఆర్‌డిఒ సూచించారు. ఈ పరిశీలనలో మైనింగ్ జియోలాజిస్ట్ కుమార్ స్వామి, డివిజనల్ సర్వే ఇన్స్పెక్టర్ పి.వెంకటరావు, ఎస్ఇబి సిఐ శ్రీనివాసరావు, భామిని సర్వేయర్ రాజేశ్వరరావు, రెవిన్యూ పరిశీలకులు రాంబాబు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పాచిపెంట

నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన మండలంలోని ఆజూరు గిరిజన గ్రామంలో సోమవారం పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు పై అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా నీడ్ డైరెక్టర్ పి వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాలువల్లో పూడికలు రోడ్లపై చెత్తాచెదారాలు లేకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే జగదీశ్వరి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశం ఎంఇఒ ఎన్.సత్యనారాయణ మాట్లాడుతున్నప్పుడు సర్పంచులు, ఎంపిటీసీలు పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావ్యవస్థకు చేరుకొని పెచ్చులుపడుతూ వర్షానికి కారుతున్నాయని, వాటిలో విద్యార్థులు చదువులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చదివించవలసి వస్తుందని వాటి స్థానంలో కొత్త భవనాలు మంజూరు చేయాలని కోరారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడినప్పుడు ఎమ్మెల్యే జగదీశ్వరి గుమ్మిడి గెడ్డ కెనాల్ జంగిల్ ను ఎప్పుడు తొలగిస్తారని, ఇంతవరకు జంగిల్స్ తొలగించకపోతే ఎప్పుడు రైతులకు నీరందుతుందని ప్రశ్నించారు. గుజ్జువాయి సర్పంచ్ గుజ్జువాయి డ్యాం ద్వారా 200 ఎకరాలకు సాగునీరందుతుందని, అయితే 70 ఏళ్లు అవుతున్నా డ్యాంలో కనీసం పూడిక తీతలు తీయలేదని, షెట్టర్లు పాడైన మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరు నిల్వ ఉండక రైతులకు సాగునీరందడం లేదని అన్నారు. ఇప్పటికే ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్నప్పటికీ సమస్య ఎప్పుడు పరిష్కరిస్తారని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు.

ఉపాధి హామీ ద్వారా జంగిల్ క్లియరెన్స్‌కు అంచనాలు వేసి పెట్టామని, ఇంతవరకు రాలేదని, వస్తే వెంటనే జంగిల్ తొలగించడం తొలగిస్తామని ఇరిగేషన్ అధికారులు సమాధానం చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు కూడా ఒక కాపీ ఇవ్వమని ఇరిగేషన్ శాఖ అధికారులు ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలం నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో ఎక్కువ మలేరియా, టైఫాయిడ్ వ్యాధులతో ప్రజలు బాధపడుతు మరణాలు కూడా జరుగుతున్నాయని, కావున ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేలా వైద్య సిబ్బంది చూడాలని సూచించారు. అలాగే మిగతా శాఖలు అధికారులు కూడా ప్రజలకు అందాల్సిన రాయితీలు, పథకాలు సక్రమంగా అందించేలా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ ఎస్.అప్పారావు, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైస్ ఎంపిపిలు అన్నాజీ రావు, రంగారావు, అన్ని శాఖల మండల అధికారులు, సర్పంచులు ఎంపిటీసీలు పాల్గొన్నారు.

ఏనుగులను తరలించాలి

జియ్యమ్మవలస : అటవీ ఏనుగుల గుంపు గత వారం రోజులుగా చిన కుదమ, కుందరువాడ గ్రామాల వ్యవసాయ భూములను నాశనం చేస్తూ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అటవీ శాఖ అధికారులకు తెలిపారు. అటవీశాఖ అధికారులతో ఆమె ఫోన్లో మాట్లాడుతూ రైతులకు ఉబాలు జరుగుతున్న సమయంలో ప్రాణ భయంతో పొలాల్లో తిరుగుతున్నారని, మరోపక్క చెరకు, అరటి, మొక్కజొన్న పంటలను నాశనం చేస్తూ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని, వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అలాగే రైతుల పంట నష్టాన్ని అంచనా వేసి సంబంధిత రెవెన్యూ అధికారులతో పూర్తి దర్యాప్తు నిర్వహించి పరిహారాన్ని చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఏనుగులను తరలించకుంటే ఆత్మహత్యలు శరణ్యం

గత నాలుగేళ్లుగా లక్షల రూపాయలు మదుపులు పెట్టి చెరుకు పంటను పండిస్తుంటే ప్రతి ఏటా పండిన పంటను నాశనం చేస్తున్న ఏనుగులను వెంటనే తరలించుకుంటే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని చెరకు రైతులు గుంట్రెడ్డి శ్రీనివాసరావు, తిరువాడ సర్పంచ్ ముదిలిపెద్ది నాయుడు, రామకష్ణ ఎమ్మెల్యేకు తమ బాధలను వివరించారు. ఏనుగులను కాపలాకు వచ్చే ట్రాకర్స్ కనీసం ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించేందుకు సహకరించడం లేదని పైగా గత రెండేళ్లుగా నష్టపరిహారంకు దరఖాస్తులను ఆన్లైన్లో పెట్టడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంఇఒపై విచారణకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఉపాధ్యాయులను వేధిస్తున్న గరుగుబిల్లి, జియ్యమ్మవలస ఎంఇఒ-1 ఎన్ నాగభూషణరావుపై విచారణకు జిల్లా కలెక్టర్ ఆర్జెడి ఆదేశాలు జారీ చేశారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఇఒ నాగభూషణరావు అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, కొద్ది రోజుల క్రితం యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అర్జీడికి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. విచారణ వేసిన తర్వాత కూడా ఉపాధ్యాయులను తాను డబ్బులు అడిగినట్లు ఎందుకు చెప్పారని బెదిరిస్తున్నారని అన్నారు. అందుకని ఆయన్ను విచారణ లేకుండానే సస్పెండ్ చేయాలని, అలా అయితేనే విచారణ సజావుగా సాగుతుందని తాము అధికారులు కోరినట్లు తెలిపారు.

మురగడాంలో పారిశుధ్య పనులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - బలిజిపేట

రోడ్డు సౌకర్యం లేక రాళ్లు వేసుకున్న దళితులు

మండలంలోని మురగడాంలో అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. 'ప్రజాశక్తి'లో ఇటీవల ప్రచురితమైన 'మురుకు కూపంలో మొరగడం' అన్న వార్తకు అధికారులు, స్థానిక నాయకుల నుంచి స్పందన లభించింది. ఈ మేరకు సోమవారం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రధాన రహదారిని గ్రావెల్‌లో కప్పారు. అయితే ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని కాలువలను పూర్తిస్థాయిలో పూడికలు తీయించాలని, గ్రామం మధ్యలో ఉన్న కాలువ ఇరువైపులా ఉన్న మురుగు నీరు గ్రామం నుంచి బయటకు పోయేలా ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరారు.

ఆశ్రమ పాఠశాలలో స్ప్రేయింగ్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వైద్య సిబ్బంది సోమవారం స్ప్రేయింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ శ్రీహరి రావు మాట్లాడుతూ విద్యార్థులు దోమల బారిన పడి వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తల నేపథ్యంలో ఆశ్రమ పాఠశాలలో స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వి రాజులమ్మ, ప్రధానోపాధ్యాయులు కె.అక్కేనా పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్ల సమస్యలపై పిఒకు వినతి

ప్రజాశక్తి - కురుపాం

ట్రాన్స్ జెండర్ల సమస్యపై హిజ్రాల అధ్యక్షులు అడ్డాకుల గీతారాణి ఆధ్వర్యంలో సోమవారం ఐటిడిఎ పిఒ సేతు మాధవన్‌కు గ్రీవెన్స్ లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకొండ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 600 మంది ట్రాన్స్ జెండర్‌లో ఉన్నామని, ఎక్కువమంది ఆదివాసీ తెగలకు చెందిన వారమని, తమ కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి కమ్యూనిటీ కోసం భవనం, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఉపాధికి సంబంధించిన శిక్షణలు, ట్రైకార్ రుణాలు, రాజకీయ, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలని పిఒకు వినతిని అందజేశారు.

వృత్తికి న్యాయం చేస్తున్న ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - బలిజిపేట

విద్యార్థిని బైక్‌పై తీసుకెళ్తున్న ఉపాధ్యాయుడు

ఈ ఫోటోలో బండిపై కనిపిస్తున్న ఇద్దరు తండ్రి కొడుకు అనుకుంటే మీరు పొరపడినట్టే. ఓ ఉపాధ్యాయుడు పాఠశాలకు సకాలంలో విద్యార్థులను తన బండిపై ఎక్కించుకొని ప్రతిరోజు ఒక దినచర్యగా తీసుకువెళ్తున్న దృశ్యమిది. వివరాల్లోకి వెళ్లగా... మండలంలోని అరసాడ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన గులిపల్లి నరసన్న నాయుడు అనే ఉపాధ్యాయుడు అదే గ్రామానికి చెందిన కరణం లక్ష్మణరావు కుమారుడు చంద్రశేఖర్‌ను తన ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లడానికి ప్రతి రోజు విద్యార్థి ఇంటికి వెళ్లి తన సొంత బండిపై విద్యార్థిని కూర్చుని పెట్టుకుని సకాలంలో పాఠశాలకు తీసుకురావడం చర్చనీయాంశంగా మారింది. పాఠశాలకు తనతో పాటు పాఠశాలకు వస్తున్న పిల్లల పట్ల అత్యంత ఆసక్తితో తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవడం ఒక మంచి పరిణామంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే కాక ఆ ఉపాధ్యాయుడే తమ పిల్లలను ఒడిలో కూర్చుని పెట్టుకుని పాఠాలు నేర్పడం, అన్నం పెట్టడం వంటి మంచి పనులు చేస్తున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పడం కొసమెరుపు.

సాయి కార్తీక్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ట్రిబుల్ ఐటి విద్యార్థి నల్ల సాయి కార్తీక్ నాయుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం చిన కుదమలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకునేందుకు వెళ్లిన విద్యార్థి అనాలోచిత చర్యలకు పాల్పడి ఇలా ఆత్మహత్యకు గురికావడం దురదృష్టకరమన్నారు. పరామర్శించిన వారిలో టిడిపి నాయకులు డొంకాడ రామకష్ణ, పల్లా రాంబాబు, గుర్రాల శ్రీరామ్ మూర్తి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

ఇటీవల అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై విద్యార్థులు , యువకులు అవగాహన పెంచుకోవాలని టౌన్ సిఐ విహెచ్.వాసునాయుడు కోరారు. సోమవారం పట్టణంలోని శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కొత్త చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని సూచించారు. స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడి భవిష్యత్తును పాడుచేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై సూచనలు

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక బాధ్యత తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని స్థానిక వైద్యాధికారి ప్రదీప్ కుమార్ విద్యార్థులకు సూచించారు. సోమవారం మండలంలోని ఎస్ గోపాలపురంలో గల మౌంట్ ఫోర్ట్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాలు ఎక్కువగా వస్తున్నందున వాటికి గురికాకుండా ఆరోగ్యంపై జాగ్రత్త తీసుకోవాలన్నారు. కాచిననీరు తాగితే జ్వరాలు రావన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయనతోపాటు సూపర్వైజర్లు జనార్దన్ రావు ,శాంతకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పరిశీలన

బలిజిపేట : మండలంలో ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ 11 గ్రామపంచాయతీలో 43 ఎకరాలు అంచనాలు రూపొందించాలని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు తెలిపారు. మండలంలోని పనుకువలసలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంకా ఎవరైనా రైతులు ఉంటే దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. ఆయనతో పాటు ఎపిఒ కె.కేశవరావు, టెక్నికల్ అసిసెంట్లు, ఫీల్డ్ అస్టింటెట్లు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

పాచిపెంట: మేలైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడానికి పొలంబడులు నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలానికి చోడి పంటపై పొలంబడి నిర్వహణపై పెద్ద కంచూరు, శతాభి, రాయివలస, ఇప్పలవలసలో 30 మంది రైతులకు 14 వారాల పాటు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఈ ఖరీఫ్ సీజన్ మొదటి దశలో రైతులకు ఎటువంటి కొరత లేకుండా ఎరువులను అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ అధికారి ఎ.అశోక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎప్పటికీ 90శాతం ఉభాలు పూర్తయ్యాయని, వరి పంటకు దశలవారీగా ఎరువులు వేస్తారని మొదటి దశకు అనుగుణంగా మండలంలోని 21 రైతు సేవ కేంద్రాల్లోనూ యూరియా 90.36, డిఎపి 65.655 గ్రోమోర్ 4.41 టన్నులు అందుబాటులో ఉన్నాయని, అలాగే ప్రైవేటు ఎరువులు వ్యాపారులు దగ్గర యూరియా 477. 335 డిఎపి 16.72 గ్రోమోర్ కాంప్లెక్స్ ఎరువులు 107.6 టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ శాఖ ఇచ్చిన సూచనల మేరకు రైతులకు ఎరువుల పంపిణీ చేయడం జరుగుతుందని ఎటువంటి అధిక ధరలు తీసుకోవడం లేదని తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని గిరిజన రైతులకు 177 టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. యూరియా 254 టన్నులు, డిఎపి 115 టన్నులు మండలానికి వచ్చిందన్నారు. ఇందులో రైతులకు 177 టన్నులు ఇప్పటి వరకు పంపిణీ చేశామన్నారు. మరో 247 టన్నులు రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ ఉంచినట్లు చెప్పారు. అలాగే ప్రైవేట్ డీలర్ వద్ద 40 టన్నులు ఉన్నాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంప్లెక్స్ ఎరువులు ఇరిడి, రెల్ల, కేదారిపురం గ్రామాలకు త్వరలో రానున్నాయని అన్నారు. ఎరువులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రణాళిక చేస్తున్నామని చెప్పారు.

సీతంపేట : రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటలో ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారి ప్రియ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా శివ శంకర ఎంటర్ప్రైజెస్, సాయి దుర్గ ట్రేడర్స్‌లో కూడా ఎరువులు ఎరువులు దొరుకుతాయన్నారు. కావున పైచోట్ల సంప్రదించి ఎరువులను వినియోగించుకోవాలని కోరారు. అలాగే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బలిజిపేట : మండలంలో అన్ని రకాల ఎరువులు రైతు సేవా కేంద్రాలు, కో-ఆపరేటివ్ సొసైటీ, వివిధ ప్రైవేట్ డీలర్ల వద్ద సరిపడా వున్నాయని ఎఒ శ్రావణ్ కుమార్ తెలిపారు. యూరియా 766.48 మెట్రిక్ టన్నులు, డిఎపి 90.6 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 243.47 మెట్రిక్ టన్నులు, పొటాష్ 28.25 మెట్రిక్ టన్నులు, సూపర్ ఫాస్ఫేట్ 28.25 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని, వీటిని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. అధిక ధరలకు ఏ ప్రైవేటు డీలర్ అయినా విక్రయిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొమరాడ : మండలంలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి పి శంకరరావు అన్నారు. 490.52 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీతానగరం: మండలంలో రైతు సేవ కేంద్రాల్లో డిఎపి 212 మెట్రిక్ టన్నులు, 326 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి అవినాష్ తెలిపారు. అంతేకాక లైసెన్స్ కలిగిన ఎరువుల దుకాణాల నుంచి 200 మెట్రిక్ టన్నుల డిఎపి, 585 మెట్రిక్ టన్నుల వరకు యూరియా సరఫరా చేశామన్నారు. కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గరుగుబిల్లి : మండలంలోని 13 రైతు సేవ కేంద్రాల్లో సరిపడా ఎరువులు ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారిని కె.విజయభారతి తెలిపారు. యూరియా 47.76 మెట్రిక్ టన్నులు, డి ఎ పి 40.3 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతు సేవ కేంద్రాల్లో నిల్వ ఉండగా, దుకాణాలు వద్ద యూరియా 31.8 మెట్రిక్ టన్నులు, డి ఎ పి 4.6 మెట్రిక్ టన్నులు, ఎమ్. ఓ. పి.12.2 మెట్రిక్ టన్నులు, ఎస్ ఎస్ పి 31.19 మెట్రిక్ టన్నుల ఎరువులు ఉన్నట్టు తెలిపారు. కాంప్లెక్స్ ఎరువులు105. 35 మెట్రిక్ టన్నుల ఎరువులు ఉన్నాయని తెలిపారు.

సాలూరు రూరల్ : ఖరీఫ్‌లో రైతులకు సరిపడా రైతులు అందుబాటులో ఉన్నాయని ఎఒ అనురాధాపండా తెలిపారు. యూరియా 347, డిఎపి 68, ఎంఒపి 70, కాంప్లెక్స్ ఎరువులు 150, ఎస్ ఎస్ పి 55 మెట్రిక్ టన్నులు ఎరువులు ఉన్నాయన్నారు.

ఎరువుల గోదాంను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

మన గ్రోమోర్ గోదాంలో తనిఖీలు

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలో మన గ్రోమోర్ సెంటర్‌లో నిల్వ ఉంచిన ఎరువులను జిల్లా ఎరువుల విభాగం వ్యవసాయ అధికారి రవీంద్ర సోమవారం తనిఖీ చేశారు. భౌతిక ఎరువుల సాంద్రత దస్త్రాలలో ఉన్న సాంద్రతకి సరిపోయిందా లేదా అని తనిఖీ చేసి సరిపోయాయి అని నిర్ధారించిన తర్వాత గ్రోమోర్ వారికి రైతులకు అవసరం మేర ఎరువులు అందించాలని సూచించారు. అలాగే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఎఒ అవినాష్ మాట్లాడుతూ మండలంలో డిఎపి కొరత లేదని, ఇప్పటివరకు అన్ని రైతు సేవ కేంద్రాల్లో 212 మెట్రిక్ టన్నుల డిఎపి, 326 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. అలాగే లైసెన్స్ కలిగిన ఎరువుల దుకాణాల వద్ద 200 మెట్రిక్ టన్నుల డిఎపి, 585 మెట్రిక్ టన్నులు వరకు యూరియా అందుబాటలో ఉందన్నారు. మంగళవారం మరో 30 మెట్రిక్ టన్నుల వరకు రైతుసేవా కేంద్రాలకు ఎరువులు వస్తాయని, కావాల్సిన రైతులు మీ గ్రామ వ్యవసాయ సహాయకులని, మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో విఎఎలు బి సుధీర్, పి లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసన్నవాణి

హమ్మయ్యా... మేడం తనిఖీ చేశారు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ కమిషనర్ ప్రసన్న వాణి ఎట్టకేలకు విధుల్లో చేరారు. దాదాపు 15రోజుల సెలవు తర్వాత ఆమె చురుగ్గా విధినిర్వహణలో పాల్గొంటున్నారు. గతంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఆకస్మికంగా మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేసినప్పుడు కమిషనర్ ప్రసన్న వాణి కార్యాలయంలో లేరు. మంత్రి సంధ్యారాణి కార్యాలయానికి చేరిన తర్వాత కమిషనర్ ప్రసన్న వాణి చేరుకున్నారు. దీంతో మంత్రి కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలోని సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆ తర్వాత కొద్దిరోజులకు కమిషనర్ సెలవులో వెళ్లారు. ఆమె సెలవులో వున్నప్పుడు ఇంఛార్జి కమిషనర్‌గా డిఇ శ్రీరామ్మూర్తి వ్యవహరించారు. ఆయన కొన్ని కీలక విభాగాలకు సంబంధించిన ఫైళ్లను ముట్టుకోకుండా పని చేశారు. సాధారణ ఎన్నికల ముందు ఇక్కడికి కమిషనర్‌గా వచ్చిన ప్రసన్నవాణి అయిష్టంగానే ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. చాలా రోజుల తర్వాత ఇప్పుడు మళ్లీ విధినిర్వహణలో చురుకుగా కనిపించారు. శనివారం మున్సిపాలిటీలో ఒక పాఠశాలలో మొక్కలు నాటారు. సోమవారం పట్టణంలోని డబ్బివీధి మున్సిపల్ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఎన్నికల విధుల్లో చేరిన అధికారులు తిరిగి వారి సొంత ప్రదేశాలకు తరలిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె పనిచేసిన పాత ప్రదేశానికి బదిలీ కావచ్చు ననే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఎంపిపిని సన్మానిస్తున్న సమైక్య అధ్యక్షులు రాజేశ్వరి, సిబ్బంది

మహిళా సంఘాల ద్వారా ప్రతి కుటుంబం ఆర్థిక అభివద్ధి సాధించాలని ఎంపిపి బొంగు సురేష్ అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో మండల సమైక్య అధ్యక్షులు పల్లె రాజేశ్వరి అధ్యక్షతన వెలుగు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా నూతన కార్యవర్గ సభ్యులను పరిచయ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విఒఎలు, సంఘాల సభ్యులు పార్టీ కార్యకర్తలుగా పని చేశారని, ప్రస్తుతం తమ ప్రభుత్వంలో మీరంతా రాజకీయ నాయకులకు ఊడిగం చేయక్కర్లేదని, మీరు ఉద్యోగస్తులుగానే పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎప్పటికప్పుడు సంబంధిత బ్యాంకు సిబ్బందితో, స్థానిక గ్రామ పెద్దలతో ఉమ్మడి ఎజెండాగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే 16 మంది మగ విఒఎలు పనిచేస్తుండగా ఇందులో 8 మందిని తొలగించి వారి స్థానంలో మహిళలను నియమించినట్లు ఆయన తెలిపారు. మిగిలిన ఎనిమిది మందిని విధులు నుండి తప్పుకొని వారి స్థానంలో మహిళా విఒఎలను ఎంపిక చేయాలని ఎపిఎం నాగభూషణరావుకు ఆదేశించారు. ఎపిఎం మాట్లాడుతూ ప్రస్తుతం 800 మంది గ్రూపు సభ్యులకు రూ.నాలుగు కోట్లు స్త్రీనిధి కింద రుణాలు ఇచ్చేందుకు లక్ష్యం కాగా, ప్రస్తుతం రూ.80 లక్షలు రుణాలు ఇచ్చామన్నారు. అలాగే బ్యాంకు లింకేజు కింద1037 సంఘాలకు రూ.41 కోట్ల 23 లక్షలు లక్ష్యం కాగా, ఇప్పటికే 51 సంఘాలకు రూ.3.50కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. అనంతరం నూతన కార్యవర్గం సభ్యులు ఎంపిపితో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణరావును, టిడిపి పార్లమెంటు అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణను, వైస్ఎంపిపి నరేష్ సత్కరించారు. కార్యక్రమంలో సిసిలు, విఒఎలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు ఉద్యోగాలు ఇవ్వండి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఏకలవ్య పాఠశాలల్లో ఐదేళ్లుగా పనిచేస్తూ ఉద్యోగాలు కోల్పోయిన గిరిజనులు పి.బంగారమ్మ, పి.లావణ్య, పి.రాజశేఖర్‌కు తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, కొండగొర్రి చిన్నారావు, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు చెల్లూరి సీతారాం, జట్ల బంగార్రాజు, మైదాన ప్రాంత గిరిజన నిరుద్యోగ సంఘం నాయకులు బొండపల్లి జనార్దన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉద్యోగాలు కోల్పోయిన గిరిజనులతో కలిసి ఐటిడిఎ పిఒ మాధవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంస్థలో గిరిజనులకు కాకుండా కేవలం ఇద్దరు గిరిజనేతరులకు మాత్రమే ఉద్యోగాలిస్తూ గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి ఉత్తర్వులు ఇవ్వడం అన్యాయం అని అన్నారు. ఉద్యోగాలు కోల్పోయిన అభ్యర్థులు మాట్లాడుతూ గిరినేతరులను విధుల్లోకి తీసుకున్నట్లే తమను విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి పిఒ స్పందిస్తూ గిరిజనులకు న్యాయం చేసేలా గిరిజన సంక్షేమ గురుకులం వారితో మాట్లాడుతానని తెలిపారు.

శుభదిన భోజన కార్యక్రమం విజయవంతం

ప్రజాశక్తి - బలిజిపేట

శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో శుభ దిన్ భోజన కార్యక్రమం విజయంతంగా నిర్వహించినట్లు ఎంఇఒ-1 సామల సింహాచలం తెలిపారు. సోమవారం ఆయన పెదపెంకి, బలిజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి శుభ దిన్ భోజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో చివరి రోజున నిర్వహించిన ఈ కార్యక్రమానికి దాతల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. దాతల సహకారంతో దాదాపుగా మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే బాధ్యతగా చేసిన ఆయా పాఠశాలల హెచ్ఎంలకు, ఉపాధ్యాయ సిబ్బందికి ఎంఇఒ అభినందనలు తెలిపారు.

తల్లిదండ్రులు శిక్షా సప్తహ్ కార్యక్రమం

కురుపాం : నూతన విద్యావిధానం అమలు జరిగి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తహ్ కార్యక్రమంలో భాగంగా శుభదిన్ భోజన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, అనంతరం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు, కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు, లక్ష్మీ, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక దృష్టి పెట్టినట్టు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం వార్డు పర్యటనలో భాగంగా కమిషనర్ బంధం వారి వీధి, టౌన్ మెయిన్ రోడ్‌లో జరుగు పారిశుధ్య పరిశీలిస్తూ పట్టణ శివారు ప్రాంతాలైన గెడ్డ వీధి, ఔట్లెట్స్ ను డంపింగ్ యార్డ్ పర్యవేక్షించారు. అలాగే మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్స్ కమిషనర్ ఆధ్వర్యంలో పట్టణంలో 1,2,3,4,13,14 వార్డుల పరిధిలో గల చిన్న కాలువలో పూడికలు తీసివేత పనులతో పాటు యాంటి లార్వా స్ప్రేయింగ్, ఇతర పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ సిహెచ్ మురళి, ఎఎస్ఒ వీరు నాయుడు, హెల్త్ అసిస్టెంట్ రామారావు, శానిటేషన్, ఎమినిటి, హెల్త్ సెక్రటరీలు శివ, సంతోష్ , నాగమణి, వార్డు కౌన్సిలర్ రణభేరి శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ప్రభుత్వ ఆసుపత్రిల్లో, వైద్య కళాశాలలో పని చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్, కాంట్రాక్టు వర్కర్లకు బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎఐటియుసి ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ఆర్.వి.ఎస్ కుమార్ నేతృత్వంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన అనంతరం వినతి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టిడిపి పాలకులు వెంటనే కలుగజేసుకొని ప్రభుత్వ ఆసుపత్రిల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ అందరిని అప్కాస్‌లో చేర్చి ప్రతి నెలా జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సింహాద్రి దుర్గారావు, యూనియన్ జిల్లా అధ్యక్షులు అలజంగీ కుమారమ్మ, నాయకులు మజ్జి చంద్ర మౌళి, సంచాన శంకర్రావు, ఆసుపత్రిల్లో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

76మంది ఐటిఐ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో సోమవారం ఉదయం నిర్వహించిన జాబ్ మేళాలో 76మంది విద్యార్థులు ఎంపికయ్యారు. హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు ప్రాంతాల నుంచి వచ్చిన ఆరు ప్రయివేటు కంపెనీల ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 76మందిని ఎంపిక చేశారు. రేడియంట్ అప్లయెన్సెస్, ఆవిష్కారం ఇండస్ట్రీస్, గ్రీన్ టెక్నాలజీస్, జెవై సొల్యూషన్స్, మైక్రోమాక్స్, టెక్ మహీంద్రా కంపెనీలకు ఎంపికయ్యారు. కోపా 15, వెల్డర్ 15, ఫిట్టర్ 14, మోటార్ మెకానిక్ 6, డీజిల్ మెకానిక్ 12, డ్రాఫ్ట్ మెన్ సివిల్ ట్రేడ్ 4గుర్ని ఎంపిక చేశారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ వి.రవికుమార్ కంపెనీలను రప్పించడంలో కృషి చేశారు. ఎంపికైన వారిని వారు అభినందించారు.

చారు మంజుదార్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - వీరఘట్టం

చారు మంజుదార్ ఆశ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో చార్ మంజుధర్ 52వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నిత్యం ప్రజా సమస్యల కోసం పోరాడిన ఏకైక వ్యక్తి మంజుదార్ అని, ఆయన్ను స్మరించుకుని మనం కూడా ప్రజా సమస్యల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎన్.వితలేశ్వరరావు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.దుర్గా చూడమణి, మండల మహిళా నాయకులు జ్యోతి, ఎన్.ఆదినారాయణ, బి.సత్యం, ఎం.దుర్గారావు, కె.తవుడు, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగి, కత్తుల కవిటి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం సిడిపిఒ బి.సిమ్మలమ్మ కిషోర్ బాలికలకు అవగాహన కల్పించారు. బాగా చదువు కోవాలని ఆరోగ్యంగా ఉండాలని తదితర అంశాలపై బాలికలకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి నాగమణి, సూపర్వైజర్ జె.జ్ఞానమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరానికి చెందిన నాగవరపు వీరభద్రుడు (64) పాముకాటుతో మృతి చెందారు. వీరభద్రుడు స్నానం కోసం శ్రీవేణుగోపాలస్వామి గుడి పక్కన ఉన్న రేవు ద్వారా సువర్ణముఖినదికి ఆదివారం సాయంత్రం వెళ్తున్న సమయంలో నాగుపాము కరిచింది. తిరిగి వెంటనే ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా, అక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో ఆయనను పరిశీలించిన వైద్యులు వీరభద్రుడు మృతి చెందినట్లు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అల్లుడు క్యాన్సర్‌తో గతఏడాది మృతి చెందాడు. కుటుంబానికి పెద్దదిక్కును కోల్పోవడంతో బాధితులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని పెద్ద బొండపల్లికి చెందిన కాలెపు సురేష్ (34) యువకుడు కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపంతో తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. దేవాంగుల వీధికి చెందిన సురేష్ చెన్నైలో ప్రైవేటు కంపెనీలో పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు 2009లో సంధ్యా అనే అమ్మాయితో వివాహమైంది. ఈయనకు ఒక కుమారుడు ఉన్నాడు. దంపతులిద్దరూ కుమారునితో కలిసి ఇటీవల చెన్నై నుంచి సొంత ఇంటికి వచ్చారు. ఆదివారం రాత్రి భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో మనస్థాపనతో గదిలోకి వెళ్లి ఎప్పటిలాగే ఒక్కడు పడుకున్నాడు. సోమవారం ఉదయం తలుపులు తెరిచేసరికి గదిలో దూలానికి ఉరివేసుకుని కనిపించడంతో కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందివ్వగా ఎస్సై దినకర్ విచారణ జరిపి వివరాలు నమోదు చేశారు.

చెరువు గట్ల పటిష్టకు బ్లాక్ ప్లాంటేషన్

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

చెరువుగట్లను పటిష్టపరిచడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు, పంచాయతీలకు ఆదాయాన్ని పెంపొందించేందుకు లక్ష్యంగా బ్లాక్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ అకిబ్ జావేద్ తెలిపారు. సోమవారం పెదకొండపల్లిలో చెరువుగట్లపై ఉపాధి హామీ పథకంలో భాగంగా కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీలో భాగంగా ఎవెన్యూ ప్లాంటేషన్ తరహాలో బ్లాక్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చెరువుగట్లపై కొబ్బరి మొక్కలతో పాటు ఖాళీ స్థలాల్లో పండ్ల జాతి మొక్కలను దశలవారీగా నాటించే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని అడ్డాపుశీల, డోకిశీల, గంగాపురం, జమదాల, జంబిడివలస, కమిటిభద్ర, బాలగోడుబ, పెదబొండపల్లి, రావికోన పంచాయతీల్లో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ చందక

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. NO.174/2023

బొంగు సింహాచలం ......వాది.
అండ్:
దొడ్డి వెంకట రావు .....ప్రతివాది.
To,
D. దొడ్డి వెంకట రావు, తండ్రి పోలి నాయుడు, గోపాలపురం గ్రామం, మక్కువ మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబరు దావాను ఇందలి వాది గారు ప్రతివాదిపై పై కోర్టులో దావాను దాఖలు చేసియున్నారు. పై నెంబరు దావాలోని ఇందలి ప్రతివాదికి తేది 06-08-2024న పైకోర్టులో వాయిదా అయియున్నది. పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీరు **తే 06-08-2024 దిన ఉదయం 10-30 గం॥**లకు మీరు గానీ, మీ వలన ఆర్డరు పొందిన వారు గానీ, మీ తరపున వకీలు గారు గానీ, పై కోర్టులో హాజరు అయి మీ తరపున వాదన దాఖలు చేసుకొనవలెను. లేనిచో పై దావా మీ పరోక్షమున తీర్మానం జరుగునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

వాయిదా తే 06-08-2024 ది.

గంట అప్పలనాయుడు
వాది తరుపు న్యాయవాది.
సాలూరు
సాలూరు,
తేది :26-07-2024